# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 18.08.2025 | 24 క్యారెట్లు 10,117.00 | కిలో వెండి 1,26,100 | 24 °C | సంపుటి:3 | సంచిక:230

www.vishalabharati.com


## ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు



- రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ ఆకాంక్ష
- సీఎం నిర్ణయాలతో ప్రజాధనం వృథా
- ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులు మోసపోయారు
- కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేశారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2 లో



## రాజకీయ పార్టీలపై ఈసీ వివక్ష చూపదు

- కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- నిరాధార ఆరోపణలకు ఈసీ భయపడదు
- ఓటు చోరీ అనడం రాజ్యాంగాన్ని అవమానించడమే
- ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే ఈసీ లక్ష్యం
- ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి
- ఇంకా 15 రోజుల సమయం ఉంది
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

విశాల భారతి, నేషనల్ బ్యూరో:
బిహార్ ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే లక్ష్యంగా 'ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ' (ఎస్ఐఆర్) చేపట్టామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అయితే కొన్ని పార్టీలు దాని గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇది తీవ్ర ఆందోళనకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బిహార్లో ఓటు చోరీకి వ్యతిరేకంగా 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన నేపథ్యంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. విలేకరుల సమావేశంలో మాట్లాడిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్, డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలు నిరాధారమైనవి అన్నారు. ఎస్ఐఆర్ను అత్యంత పారదర్శకంగా చేయడానికి తమ అధికారులు చాలా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని పార్టీలపై ఆయన పరోక్షంగా విమర్శలు సంధించారు. కొన్ని పార్టీలు, వాటి నాయకుడులు

మిగతా 2 లో




## బిహార్ లో ఓట్లు 'చోరీ' కానివ్వం

విశాల భారతి, నేషనల్ బ్యూరో:
బీజేపీతో కుమ్మక్కై ఓట్లను భారత ఎన్నికల సంఘం (ఈసీ) దొంగిలిస్తోందని యావత్ దేశానికి ఇప్పుడు తెలుసని లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కుట్రలో వాళ్లను ఇండియా కూటమి నెగ్గనివ్వదని ఆయన స్పష్టం చేశారు. 'ఓటరు జాబితా సమగ్ర సవరణ' (SIR) ద్వారా ఓటరు జాబితాల్లోకి ఓటర్లను కలిపి, తీసివేసి బిహార్ అసెంబ్లీ ఎన్నికలనూ తస్కరించాలని ఈసీ, బీజేపీ కుట్ర పన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. బిహార్‌లోని 20 జిల్లాల్లో 1,300 కి.మీ పరిధిలో ఆయన 'ఓటర్ అధికార్ యాత్ర'ను చేయనున్నారు. ఆదివారం ఈ యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా బిహార్‌లోని ససారంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రసంగించారు. బిహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడేందుకు వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశాన్ని ఇవ్వబోమని రాహుల్ గాంధీ అన్నారు. పేదల చేతిలో ఉన్న ఏకైక శక్తి ఓటుహక్కు మాత్రమేనని, దాన్ని పేదలకు దూరం కాకుండా చూస్తామని ప్రకటించారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ యత్నిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

- ఎస్ఐఆర్‌తో బీజేపీ, ఈసీ ఉమ్మడి కుట్ర
- ఈసీ పన్నాగాన్ని ఇండియా కూటమి అడ్డుకుంటుంది
- యావత్ దేశంలో ఓట్ల చోరీ అయ్యాయి
- ఆర్ఎస్ఎస్,బీజేపీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయి
- బిహార్ ససారంలో ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- బీజేపీతో ఓట్లు, హక్కులు, రాజ్యాంగంకు ముప్పు
- కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే
- ఎన్డీఏను ఇండియా ఓడించబోతోంది
- ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్

2 లో





## కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

- మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు
- అలా చేస్తే మోటార్లు పాడైతాయి.బేరింగ్లు పోతాయి
- నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి నష్టం
- రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు.
- ఇప్పటికైనా వరద నీళ్లను ఒడిసిపట్టండి - బురద రాజకీయాలను మానుకోండి
- - ఎమ్మెల్యే హరీశ్‌రావు

విశాల భారతి స్టేట్ బ్యూరో:
కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద నీళ్లను ఒడిసిపట్టి.. బురద రాజకీయాలను మానుకోవాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం మోటార్లపై కాంగ్రెస్ కుట్ర పన్నింది. మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు. అవేమన్న మీ ఇంట్లో ఉండే మోటార్లు అనుకున్నారా? అలా చేస్తే మోటార్లు పాడైతాయి. బేరింగ్లు పోతాయి వేలకోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంపై బీహెచ్ఈఎల్ కూడా కాంగ్రెస్

మిగతా 2 లో

## ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

- ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా రాధాకృష్ణన్
- గతంలో కోయంబత్తూరు ఎంపీగా పనిచేశారు.
- జార్ఖండ్, తెలంగాణ గవర్నర్‌గా కూడా సేవలు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటన



విశాలభారతి, నేషనల్ బ్యూరో:
ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ వీడింది. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరు ఖరారైంది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన ఉప రాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. మహారాష్ట్ర గవర్నర్ చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ను ఉపరాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా నేషనల్

మిగతా 2 లో



# బిహార్ లో ఓట్లు 'చోరీ' కానివ్వం

దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించామని వెల్లడించారు. యావత్ దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓట్ల చోరీ జరిగిందన్నారు. నిజమైన కులగణనను మోదీ చేయించరు.'ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిజమైన కులగణనను చేయించరని నాకు తెలుసు. ఇండియా కూటమి మాత్రమే సిసలైన కులగణనను చేయించగలదు. ఓట్ల చోరీకి మేం అడ్డుకట్ట వేస్తాం. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR)తో ముడిపడిన నిజాలను బయటికి తెస్తాం. నేను మనసారా లాలూజీకి ధన్యవాదాలు చెబుతున్నాను. ఇంటి బయటికి వెళ్లొద్దని డాక్టర్ చెప్పినా వినకుండా నా కోసం ఇక్కడికి లాలూజీ వచ్చారు' అని రాహుల్ గాంధీ తెలిపారు.

**బీజేపీని తప్పించకుంటే ఓట్లు, హక్కులు, రాజ్యాంగంకు ముప్పు**

**- కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే**

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్లంతా మనకు ఓటుహక్కును ప్రసాదించారని, ఈ హక్కును సవాల్ చేసేలా ఎర్రకోటలో ప్రధాని మోదీ ప్రసంగించారని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందన్నారు. మహాత్మాగాంధీ హత్యకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణమని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఎంతమంది ఆర్ఎస్ఎస్ నేతలు జైలుకు వెళ్లారో చెప్పాలని మోదీని ఖర్గే ప్రశ్నించారు. కనీస అర్హత లేని వాళ్ల పేర్లను ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ ప్రస్తావించడం తప్పు అన్నారు. ప్రధాని మోదీ చాలా ప్రమాదకారి అని, ఆయన్ను అధికారం నుంచి తప్పించకుంటే ఓట్లు, హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగం అన్నీ ప్రమాదంలో పడతాయని ఖర్గే వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్‌కు బ్రిటీష్ వాళ్లతో కలిసి పనిచేసిన చరిత్ర ఉందన్నారు. బీజేపీ వాళ్లు ఓట్ల చోరీకి యత్నిస్తున్నారని, మోదీ సర్కారుకు ఏజెంటులా ఈసీ పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ప్రజలు తగిన శాస్తి చేస్తారన్నారు.

**ఎన్‌డీఏను ఇండియా ఓడించబోతోంది**

**- ఆర్‌జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్**

'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని ఇండియా కూటమి ఓడించబోతోంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఎన్‌డీఏ కూటమిని ఓడించక తప్పదు. ఎమర్జెన్సీ కాలం కంటే దారుణమైన పరిస్థితులు ఇప్పుడు మన



దేశంలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో రాహుల్ గాంధీ మాతో ఉండటం చాలా మంచి విషయం. ఆయన యాత్రతో ప్రజలకు ఇండియా కూటమి మరింత చేరువ అవుతుంది' అని ఈసందర్భంగా ఆర్‌జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ తెలిపారు.

**ఓట్ల చోరీకి ఈసీని బీజేపీ వాడుకుంటోంది**

**- ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్**

'ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్ల లూటీ తప్ప మరొకటి కాదు. ప్రజల ఓట్లను చోరీ చేసేందుకు ఈసీ యత్నిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని జరగనివ్వం. బీఆర్ అంబేద్కర్ మనకు ఓటు హక్కును ఇచ్చారు. కానీ ఈసీ ద్వారా దాన్ని ప్రజల నుంచి తస్కరించేందుకు బీజేపీ ప్లాన్ వేసింది. బీజేపీ చెప్పినట్లుగానే ఈసీ పనిచేస్తోంది. బిహార్ రాష్ట్ర ప్రజలను దగా చేసే అవకాశాన్ని మోదీజీకి ఇవ్వం. ఓట్లను చోరీ చేసి మళ్లీ అధికారాన్ని దక్కించుకునే స్కెచ్‌ను ఈసీ, బీజేపీ అమలు చేస్తున్నాయి' అని ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు.

**ఇది కేవలం రాజకీయ యాత్ర కాదు**

కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రలను విజయవంతం చేసిన తర్వాత ఇప్పుడు ఓటర్ అధికార్ యాత్రను రాహుల్ గాంధీ నిర్వహిస్తున్నారు. దీనికి ఇండియా కూటమి పార్టీల మద్దతు ఉంది. బిహార్‌లో లక్షలాది మంది ప్రజల ఓట్లను చోరీ చేసేందుకు బీజేపీ కుట్ర పన్నిన విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకే ఈ యాత్రను రాహుల్ మొదలుపెట్టారు. ఇది కేవలం రాజకీయ యాత్ర కాదు. భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామిక సంస్థల పునరుద్ధరణ, ప్రతీ భారతీయుడి ఓటును కాపాడటం అనే లక్ష్యాలతో ఈ యాత్ర జరుగుతుంది. ఒక వ్యక్తి ఒక ఓటు భావనను పరిరక్షిస్తాం' అని పేర్కొంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు.

# ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

> - రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ ఆకాంక్ష
> - సీఎం నిర్ణయాలతో ప్రజాధనం వృథా ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులు మోసపోయారు
> - కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదే పదే చెబుతున్న ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజాధనం వృథా అవుతోందన్నారు. ఫార్మా సిటీ కోసం భూమిలిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీన్ని అంగీకరిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారు చేసిందని.. స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దాంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు.

# రాజకీయ పార్టీలపై ఈసీ వివక్ష చూపదు



> - కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు
> - నిరాధార ఆరోపణలకు ఈసీ భయపడదు
> - ఓటు చోరీ అనడం రాజ్యాంగాన్ని అవమానించడమే
> - ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే ఈసీ లక్ష్యం
> - ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి
> - ఇంకా 15 రోజుల సమయం ఉంది
> - సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

బిహార్ ఎస్ఐఆర్ గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. బిహార్ ముసాయిదా ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీలు తమ వాదనలు, అభ్యంతరాలను వ్యక్తం చేయాలని ఈసీ కోరుతోంది. దీనికి ఇంకా 15 రోజుల సమయం ఉంది. ఎన్నికల కమిషన్ తలుపులు అందరికీ తెరిచే ఉన్నాయి. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు అందరూ అత్యంత పారదర్శకంగా కలిసి పనిచేస్తున్నారు. వాస్తవానికి రాజకీయ పార్టీల మధ్య ఈసీ ఎలాంటి వివక్ష చూపదు. పాలక, ప్రతిపక్ష పార్టీలు రెండింటినీ ఎన్నికల కమిషన్ సమానంగా చూస్తుంది. 45 రోజుల్లో ఎలాంటి ఎన్నికల పిటిషన్లు వేయకుండా, కేవలం ఓటు చోరీ జరిగిందంటూ ఆరోపణలు చేస్తుండడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. డబుల్ ఓటింగ్, ఓటు చోరీ అనే నిరాధార ఆరోపణలకు ఈసీ కానీ, ఓటర్లు కానీ భయపడరు అని సీఈసీ అన్నారు. కొందరు ఆడుతున్న రాజకీయాల గురించి ఈసీ పట్టించుకోదని స్పష్టం చేశారు. బిహార్లో చేపట్టిన ఎస్ఐఆర్కు వ్యతిరేకంగా, ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన నేపథ్యంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం మాట్లాడుతూ ఈసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్ అధికార బీజేపీతో కుమ్మక్కై ఓట్లను, ఎన్నికలను చోరీ చేస్తోందని అన్నారు. బిహార్లో ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి బీజేపీ, ఈసీ కుట్ర పన్నాయని అన్నారు. అయితే ఆ కుట్రను ఇండియా కూటమి కచ్చితంగా అడ్డుకుంటుందని చెప్పారు.


# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

> - మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు
> - అలా చేస్తే మోటార్లు పాడైతాయి, బేరింగ్లు పోతాయి
> - నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్నారు
> - కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి నష్టం
> - రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు.
> - ఇప్పటికైనా వరద నీళ్లను ఒడిసిపట్టండి
> - బురద రాజకీయాలను మానుకోండి
> - ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మోటార్లు పనికిరాకుండా అయితే మళ్లీ ఆ బద్నాం బీఆర్ఎస్ పార్టీపై వేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టింది. ఇప్పటికైనా బురద రాజకీయాలు మాని వరద నీటిని ఒడిసి పట్టండి అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం కలుగుతున్నది. ఉన్న వ్యవస్థను నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదా..? కమీషన్లకు, వాటాలు పంచుకోవడానికి సమయం సరిపోతలేదా..? రైతు ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా ? నంది మేడారంలో ఖటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశాను. అన్నపూర్ణ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి. వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాను. దురదృష్టం ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి





వదులుతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల విలువ రైతులకు తెలుస్తది.. ఉత్తంకుమార్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి తెలియదు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు. ఆయన రైతు గనుక ప్రతి చుక్కను ఒడిసిపట్టి నీళ్లను రైతులకు అందించాడు. మీరు ఎన్నడు వ్యవసాయం చేయలేదు అందుకే మీకు నేల విలువ తెలియదు. ఈ రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదు. కాంగ్రెస్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

**ఆర్మూర్, విశాల భారతి:**

అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు సీఎం సహాయ నిధి వరంగా మారింది. నందిపేట మండలంలోని ఉమ్మేడ గ్రామానికి చెందిన బాధితులు అల్లకొండ రవీందర్ రూ. 45 వేలు ముల్క సుధ కు రూ. 11500వేలు ప్రమీల కు రూ. 14వేలు వీణ మణిదీప్ లకు రూ. 11500 ఆస్పత్రి ఖర్చుల కొరకు స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం చెక్కులు అందజేశారు. చెక్కులు మంజూరు కావడానికి కృషిచేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు భూతం సాయ రెడ్డి, రాజా ఓంకార్, కన్నూర్ ముత్యం, మురళీమోహన్, మురళి, ఉప్పరి కుమార్, మల్కన్న, బలగం మోహన్, తదితరులు పాల్గొన్నారు.




**ఆర్మూర్, విశాలభారతి:**

నందిపేట్ మండలంలోని ఉమ్మేడ గోదావరి నది పరివాహక ప్రాంతం నది ఒడ్డున గల ఉమామహేశ్వర ఆలయం లోకి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శ్రీరామ్ సాగర్ బ్యాక్ వాటర్ రావడంతో ఆదివారం గుడిలోకి నీళ్లు చేరాయి. ప్రతి సంవత్సరం ఉమామహేశ్వర ఆలయం నీట మునిగి, శివరాత్రి పండుగ సమయంలో తేలుతుంది. శివరాత్రి పండుగ వచ్చేసరికి భక్తులకు దర్శనమిస్తుంది. అటుగా వెళ్లే ప్రజలు తమ సెల్ ఫోన్ లలో వీడియోలు తీస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో చాలామంది వీక్షిస్తున్నారు.

# దళితరత్న అవార్డు అందుకున్న ఇంద్రాల ఉపేందర్




**దేవరుప్పుల, విశాలభారతి:**

మండల సుపరిచితుడు గుండాల మండలంలోని మడిపడిగ గ్రామానికి చెందిన సామాజిక సేవకులు ఇంద్రాల ఉపేందర్ దళిత రత్న అవార్డు అందుకున్నారు. బాల్య విద్యాభ్యాసం చేస్తున్న రోజులలోనే సామాజిక సేవ రంగాలలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది అభాగ్యులకు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడి పలువురి మన్ననలు పొందాడు. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంలో ఆదివారం రవీంద్ర భారతి లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో దళితరత్న అవార్డును ఇంద్రాల ఉపేందర్ కు సినీ నటుడు బాబు మోహన్ జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ విఆర్ శ్రీనివాస్ ఇతర ప్రముఖులు అందజేశారు. దళితరత్న అవార్డు అందుకున్న ఇంద్రాల ఉపేందర్ ను పలువురు విద్యావంతులు మేధావులు సామాజిక సేవ కార్యకర్తలు గ్రామస్తులు స్నేహితులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



# ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

> - ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా రాధాకృష్ణన్
> - గతంలో కోయంబత్తూరు ఎంపీగా పనిచేశారు.
> - జార్ఖండ్, తెలంగాణ గవర్నర్‌గా కూడా సేవలు
> - బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

డెమోక్రటిక్ అలయెన్స్ (NDA) ప్రకటించింది. జగ్దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరగాల్సి ఉండగా, ఆగస్టు 22వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. గతంలో కోయంబత్తూరు ఎంపీగా పనిచేశారు. జార్ఖండ్, తెలంగాణ గవర్నర్‌గా కూడా సేవలందించారు. 1957 మే 4న రాధాకృష్ణన్ జన్మించారు. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. తమిళనాడులో బీజేపీ బలోపేతానికి విశేష కృషి చేశారు. పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికను ఖరారు చేసేందుకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారంనాడు సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షా తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. సమావేశానంతరం సీపీ రాధాకృష్ణన్ నామినేషన్‌ను జేపీ నడ్డా ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థికి విపక్షాలు సైతం తమ మద్దతు తెలుపుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సోమవారం
18.08.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



## సెల్ ఫోన్లు అప్పగింత



**ఆర్మూర్, విశాలభారతి:**
ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా సేకరించి ఆదివారం బాధితులు సత్యప్రసాద్, అస్లం ఫర్వేజ్, లాల్ సింగ్ లకు ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ అందజేశారు.



## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సీఐ మన్మధ కుమార్

**చౌటుప్పల్, విశాలభారతి:**
పట్టణ కేంద్రంలోని శ్రీ ఉరముత్యాలమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్.ఈ సందర్భంగా ముత్యాల దేవస్థానం అధ్యక్షులు సంతగళ్ళ సతీష్ గౌడ్ మరియు ప్రధాన కార్యదర్శి తూర్పునూరు రవి గౌడ్ వారికి శాలువా కప్పి సన్మానించారు.తదనంతరం వారు మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజే స్తూ,పండగను పిల్లా పాపలతో కుటుంబ సభ్యులు సంతోషం జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయక ఘటనలు తావులేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.



## అలుపెరగని పోరాట నాయకుడు ముద్దం శ్రీనివాస్ రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:**
నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు కట్టుబడి ఉన్న ఆదర్శ నాయకుడు ముద్దం శ్రీనివాస్ రెడ్డి అని ఎమ్మెస్సార్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, అమ్మాపురం మాజీ ఎంపీటీసీ ముద్దం విక్రమ్ రెడ్డి తెలిపారు.ఎమ్మెస్సార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నాయకుడు ముద్దం శ్రీనివాస్ రెడ్డి 10వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం డివిజన్ కేంద్రంలోని అన్నారం రోడ్డు లో నిర్వహించారు. అనంతరం గోశాల షెడ్డు నిర్మాణానికి రూ.6 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి స్థూపానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ…నమ్మిన సిద్ధాంతం పట్ల, పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావం, అచంచల విశ్వాసం ఉన్న వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి అని, పాలకుర్తి నియోజకవర్గం లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన కృషి మరువలేనిది అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి శ్రీనివాస్ రెడ్డి అనేక పోరాటాలు నిర్వహించాడని గుర్తు చేశారు.అన్ని రకాల దోపిడీల నుండి సమాజాన్ని విముక్తి చేసేందుకు తన జీవితాన్నే అంకితం చేసిన కామ్రేడ్ ముద్దం స్వప్నాన్ని సాకారం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. నేటి తరం శ్రీనివాస్ రెడ్డి ఆశయాలను,ఆదర్శాలను పుణికి పుచ్చుకొని ప్రజా సమస్యల పరిష్కారానికై అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓమ బిక్షపతి, బొల్లం అశోక్, ఎండి యాకూబ్,గణపురం లక్ష్మణ్, కోటగిరి కాంతం, మల్లయ్య, ఎల్లయ్య, వెంకన్న,కృష్ణమూర్తి, రాములు, రామ్మూర్తి, రజనీకాంత్, యాకన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## మా భూములను మాకు ఇప్పించండి

- కబ్జా కోర్ల నుండి మమ్మల్ని కాపాడండి
- ప్రాణభయంతో బతుకుతున్నాం మాకు రక్షణ ఇప్పించండి
- పాదూరి వీరారెడ్డి, గుంటక శ్రీనివాస్

**తిరుమలగిరి, విశాలభారతి:**
మహబూబాద్ జిల్లా తొరూర్ కు పాదూరి వీరారెడ్డి, చిట్యాల గ్రామం కు చెందిన గుంటక శ్రీనివాస్ ఇరువురు కలిసి వెలిశాల గ్రామానికి చెందిన ఏపూరి సుగుణమ్మ భూమిని 77 /అ సర్వేనెంబర్ లో ఒక ఎకరం 20 గుంటలు ఖరీదు చేసి పట్టా చేసుకున్నారు. అట్టి భూమి ని 2024లో కొందరు వ్యక్తులు తప్పుడు హద్దులు పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వాళ్ల నుండి మాకు ప్రాణభయం ఉన్నదని,మా భూమిని మాకు అప్పగించి తగు న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.



## పార్థివదేహానికి నివాళులర్పించిన పబ్బు రాజు గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:**
పట్టణ కేంద్రంలోని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రాంప్రసాద్ గుండెపోటుతో మరణించడం జరిగినది.వారి పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజు గౌడ్ పూల మాల వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం జరిగినది.
ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్,బొంగు జంగయ్య గౌడ్,బొబ్బిళ్ళ మురళి,పులనగారి అశ్విన్ గౌడ్,యస్ కే జానీ బాబు,చెరుకు లింగస్వామి గౌడ్, సుర్వి మహేశ్ ,బొంగు రాజు మరియు డాక్టర్స్ బృందం పాల్గొన్నారు.

## ఈ వసూల్లో టీఎస్ ఎండిసి వాటా ఎంత…?



- అక్రమ వసూళ్లకు అడ్డాగా టేకులగూడెం ఇసుక ర్యాంపు
- 4000 ఇస్తేనే లారీ లోడింగ్ లేకపోతే ఎన్ని రోజులైనా ఉండాల్సిందే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

**వాజేడు, విశాలభారతి:**
ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని టేకులగూడెం ఇసుక ర్యాంపులో అక్రమ వసూళ్ల దందా కొనసాగుతుంది. నూతనంగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఇసుక రాంపుల్లో కనీసం లోడింగ్ ఛార్జ్ కూడా తీసుకోవద్దని నిబంధనలు పెట్టినప్పటికీ టిఎండిసి అధికారులు ఇసుక ర్యాంపు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనికి ఉదాహరణగా మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన టేకులగూడెం ఇసుకరాంపు లో జరిగే అక్రమ వసూళ్లే ఉదాహరణ. చతిస్గడ్, తెలంగాణ సరిహద్దు టేకులగూడెం ఇసుక ర్యాంపు లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. లోడింగ్ చార్జీ తీసుకోవద్దని ఒకవైపు రేవంత్ సర్కార్ చెబుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు అమలు కావడం లేదు, ఒక లారీ లోడింగ్ జరగాలంటే 3000 నుంచి 4000 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని లారీ డ్రైవర్లు వాపోతున్నారు ఎవరైతే నాలుగు వేల రూపాయలు ఇవ్వని యెడల వారిని ఎన్ని వారాలైనా వేచి ఉండాల్సిందేనని అంటున్నారు. అటు కాంట్రాక్టర్లు ఇటు టిఎస్ఎండిసి అధికారులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో ఎవరు కూడా ఈ ప్రాంతానికి రారని ధీమాతో ఇంతటి ఘాతుకానికి పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.లోడింగ్ చార్జీలు అత్యధికంగా వసూలు చేయడంతో లారీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు లారీ డ్రైవర్లకు సొసైటీ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటుంది. లోడింగ్ చార్జీలు వసూలు చేసేది కాంట్రాక్టర్ కు సంబంధించిన వ్యక్తులైతే లారీ డ్రైవర్లు సొసైటీ సభ్యులను ప్రశ్నిస్తున్నారు. లారీ డ్రైవర్లకు సొసైటీ సభ్యులు సమాధానం చెప్పలేక నివ్వరపోవలసిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. అక్రమంగా డబ్బులు వసూలు చేసి సొమ్ము చేసుకునేది ఒకరైతే నింద పడాల్సింది మరొకరిగా మారింది. రేజింగ్ కాంట్రాక్టర్ గా ఉన్న వ్యక్తులు అక్రమాలకు పాల్పడుతూ అమాయక గిరిజనులపై నిందలు వేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు, మరియు పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ఈ అక్రమాలకు అడ్డు కట్ట పడదని ఈ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

## సొసైటీ లీడర్ల మంటూ అమాయక రైతులపై దౌర్జన్యం



- జేసీబి యంత్రం సహాయంతో రైతు రేకుల షెడ్ ధ్వంసం
- సేద్యం చేస్తున్న భూమిలో అక్రమంగా గుడిసెలు ఏర్పాటు
- తహసీల్దార్‌కు పిర్యాదు చేసిన బాధిత రైతులు
- సంబంధం లేని వ్యక్తులు బెదిరిస్తున్నారు
- అక్రమంగా రేకుల షెడ్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**కురవి, విశాలభారతి:**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని నేరడ గ్రామ పరిధిలో వున్న రెవిన్యూ సొసైటీ లీడర్ల మంటూ మలేపాక మధు, తుపాకు ఉప్పలయ్య, నీరుడు వెంకన్న, నీరుడు చిన్న సామెలు, ఇరుగు శ్రీను, ఇరుగు పిచ్చయ్య, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఇరుగు వెంకన్న, కోడూరి అనిల్ వీరితోపాటు సుమారు 30 మంది శుక్రవారం అమాయక రైతులపై దౌర్జన్యం చేస్తున్నారు. 1972లో అప్పటి ప్రభుత్వం నిరుపేదలకు సొసైటీ ద్వారా సర్వేనెంబర్ 545/1 లో భూ పంపిణీ చేశారు. తదుపరి భూ బాధితులు తమ అవసరాల కోసం ఇతరులకు అమ్ముకోవడం జరిగింది. 2009లో సొసైటీ రద్దు చేసి ఐటీడీఏ ద్వారా అప్పటి కమిటీ తీర్మానించి భూమిపై ఉన్న రైతులకు భూ పట్టాలు చేశారు. తదుపరి అప్పట్లో అమ్ముకున్న వ్యక్తులు దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నా వారిపై దౌర్జన్యం చేస్తూ మా భూములంటూ సొసైటీ లీడర్ల మంటూ ఆలేటి ఉప్పలమ్మ, భర్త ఎల్లయ్య సాగు భూమిలో దౌర్జన్యంగా గుడిసెలు వేశారు. తదుపరి మంద ఇద్దమ్మ సాగు చేసుకునే భూమిలో రేకుల షెడ్డు ధ్వంసం చేసి రూ. 4 లక్షలు ఆస్తి నష్టం చేశారు. బాధ్యతల ఫిర్యాదు మేరకు తాసిల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ నెల్లురి రవి కుమార్ విచారణ చేసి తగు నివేదికను పై అధికారులకు సమర్పిస్తానని తెలిపారు.2010లో ప్రభుత్వం గుర్తించి నేరడ రెవెన్యూ పరిధిలోని 545 సర్వే నెంబర్ లో భూమి కల్పించి పట్టా ఇచ్చారు. నాకు ఇద్దరు కుమారులు 2010 నుండి ప్రభుత్వం కల్పించిన నా పట్టా భూమిలో సేద్యం చేసి పంట పండించే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. శుక్రవారం నేరడ గ్రామానికి చెందిన మలేపాక మధు, తుపాకు ఉప్పలయ్య, నీరుడు వెంకన్న, నీరుడు చిన్న సామెలు, ఇరుగు శ్రీను, ఇరుగు పిచ్చయ్య, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఇరుగు వెంకన్న, కోడూరి అనిల్ వీరితోపాటు సుమారు 30 మంది వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. ఇదేమిటని మందలిస్తే మేము 30 మంది ఉన్నాము. ఎక్కువ మాట్లాడితే నీ సంగతి చెప్తామంటూ దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తూ నా పట్టా భూమిలో గుడిసెలు వేశారు. ఈ విషయంపై కొరివి తహసిల్దార్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు.

## మద్యం సేవిస్తూ వాహనాలు నడిపిన యువకులు అరెస్ట్

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజు



**రాజేంద్రనగర్ విశాలభారతి :**
ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజు హెచ్చరించారు. శనివారం రాత్రి బండ్లగూడ నుండి అరంఘర్ వైపు ద్విచక్ర వాహనాలపై మద్యం సేవిస్తూ కొందరు యువకులు ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగేలా డేంజర్ గా ద్విచక్ర వాహనాలను నడుపుతూ బయందోళనలకు గురి చేశారు.ఇతర వాహనదారులు వారి చేష్టలను వీడియో తీసి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ లకు పంపడంతో ఆ ద్విచక్ర వాహనాలు నడిపిన యువకులను గుర్తించి స్టేషన్ కు తరలించారు. వారి డాక్యుమెంట్స్ చెక్ చేసి మైలార్దేవ్పల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ రాజు మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా తమ వాహనాలను నడపాలని మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఒక్క కాలనీలో నాలుగు వినాయక మండపాలు ఎందుకు

- ఒక్క వినాయక మండపం పెట్టుకోండి కీసర సిఐ



**కీసర,విశాలభారతి :**
కీసర పోలీస్ స్టేషన్ లో వినాయక చవితి పండుగ నేపథ్యంలో ప్రజలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించిన కీసర సి ఐ అర్వపల్లి ఆంజనేయులు.ఈ సంధర్భంగా పలువురు మాట్లాడుతూ మనం వినాయక మండపం ఏర్పాటు చేసే ముందు స్కూల్స్ పక్కన ఏర్పాటు చేయొద్దు అని సూచించారు. అలాగే వినాయక మండపంలో వినాయకుడిని పెట్టి నిమర్జనం సమయం అయిపోయిన కొందరు మాత్రం ఇరవై రోజులు పెడుతున్నారు ఈది మంచిది కాదు అని అన్నారు.అనంతరం కీసర సి ఐ మాట్లాడుతూ మనకు వినాయక చవితి అంటే గతంలో అందరూ సంఘటితం కావడానికి వినాయకాయ చవితిని తొమ్మిది రోజుకు పెట్టుకొని శత్రువులను ఎలా జయించాలి అని మాట్లాడుకునే వారం అని గుర్తు చేశారు.కానీ ఇప్పుడు ఒక్క కాలనీలోనే నాలుగు వినాయక మండపాలు పెడుతున్నారు అలా కాకుండా ఒక్క వినాయక మండపం ఉంటే బాగుంటుంది అని తెలిపారు.అలాగే వినాయక నిమర్జనం సమయంలో నాలుగు గంటలకు మొదలై రాత్రి పది గంటలకు ముగిసేలా చూడాలి అని అన్నారు.మధ్యలో మిలన్ పండుగ ఉంది అందరు సహకరించి శాంతి భద్రతలకు ఆటకం కలిగించొద్దు అని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు కీసర సెక్టార్ ఎస్ ఐ వెంకటేష్,రాంపల్లి సెక్టార్ ఎస్ ఐ హరి ప్రసాద్,మాజీ ప్రజాప్రతినిధులు సింగు రెడ్డి వెంకట రెడ్డి,మాజీ కౌన్సర్ వెంకటేష్,కీసర కాంగ్రెస్ నాయకులు జూపల్లి రవీందర్,కందాడీ హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
vishalabharathi Telugu Daily
సోమవారం
18.08.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






- పాలకుల తీరు,ప్రభుత్వాల వైఖరి మారాలి
- బోడుప్పల్లో 339వ వారం అంబేద్కర్ కు జ్ఞానమాల
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య

# ఆక్రమణకు గురైన ఐతన కుంట



**పొంచి ఉన్న ప్రమాదం, వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు**

**మణుగూరు, విశాలభారతి:**
సింగరేణి సి టైప్ కాలనీకి ఎదురుగా ఉన్న ఐతన కుంట అక్రమానికి గురై సింగరేణి సివిల్ కార్యాలయం ప్రహరీ గోడ మరియు అనేక గృహ సముదాయాలు కుంట లోనే ఆక్రమించి నిర్మించారు. దీని కారణంగా ప్రమాదం పొంచి ఉన్నదని సిపిఎం మండల కమిటీ పేర్కొన్నది ఆదివారం సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్ పంచాయతీ పరిధిలో సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐతనకుంట అలుగును సైతం ఆక్రమించారని తెలిపారు. కుంట లో 150 వరకు ఇండ్ల నిర్మాణాలు జరగడం కారణంగా వరద ఒత్తిడి గురై ఇండ్లు కూలే ప్రమాదం ఉందన్నారు వరద ప్రవాహానికి చెరువు కట్ట కు ప్రమాదం పొంచి ఉందన్నారు చెరువులో వ్యర్థపదార్థాలు పేరుకుపోవడం కారణంగా నీరు కలుషితమైనయని అన్నారు. పశువులు కూడా తాగలేనంతగా చెత్తచెదారం వ్యర్థ పదార్థాలు పేరుకుపోయాయని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి కుంటలో నిర్మించిన ఇండ్లను తొలగించాలని ఐతన కుంటను పరిరక్షించాలని డిమాండ్ చేశారు ముత్యాలమ్మ నగర్ మరియు సంతోష్ నగర్ గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుందన్నారు. సీసీ రోడ్ల కాంట్రాక్టర్లకు లాభాలు, మరియు ప్రజా ప్రతినిధులకు పర్సంటేజ్ కొరకే నిర్మించారు తప్ప ప్రజలకు ఉపయోగం లేదన్నారు. కొన్ని ప్రాంతాలలో నివాస గృహాలకు ఎత్తులో సిసి రోడ్డు నిర్మించడం కారణంగా మురుగునీరు ఇండ్లలో నిలిచి పోయిందన్నారు. కొన్ని ప్రాంతాలలో సిసి రోడ్లను నివాస గృహాలకు కిందికి నిర్మించడంతో రోడ్లపైనే మురగనీరు నిలిచి పోతుందన్నారు. దీని కారణంగా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని బ్లీచింగ్ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల వెంకన్న, బొల్లం రాజు, తోట పద్మ, పల్లపు నాగేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ నాలుగో వార్డ్ నందు శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ స్థిర యంత్ర విగ్రహ పునర్ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం నాడు పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ నాలుగో వార్డ్ మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యా విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ నందు విగ్రహ ప్రతిష్ట ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా విద్యా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో పురాతనమైన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయమును పునర్నిర్మాణం చేపట్టే అదృష్టం తనకు దక్కడం ఎంతో సంతోషకరమని అన్నారు, గత మూడు రోజుల నుండి దేవాలయ ప్రాంగణం నందు నిత్యం అన్నదాన కార్యక్రమము నిర్వహించడం జరిగిందని ఈ ఆలయం నిర్మాణానికి సహకరించిన గ్రామ పెద్దలకు స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట అనంతరం పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు బోనాలను సమర్పించి తల్లి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది, పోచమ్మ తల్లి దీవెనలు ఎల్లవేళలా ప్రజల అందరిపై ఉండాలని కోరారు, ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు పసుల రాజేందర్ ముదిరాజ్, దండెం కృష్ణారెడ్డి, బొర్ర సురేష్ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోచమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకున్నారు.

# సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయండి



**తిరుమలగిరి, విశాలభారతి:**
ఆదివారం రోజు తిరుమలగిరి మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లముల యాదగిరి మాట్లాడుతూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభ మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, గాజుల రామవరం మహారాజ గార్డెన్ లో ఈనెల 19 నుండి 22 తారీకు వరకు జరుగుతాయని అట్టి మహాసభలను జయప్రదం చేయాలని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన పార్టీ అని ఆయన అన్నారు. అనేక కార్మిక పోరాటాలు నిర్వహించిందని, ఎనిమిది గంటల పని దినాల కోసం న్యాయబద్ధమైన వేతనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం పోరాడుతూనే, కార్మిక వర్గ చట్టాల సాధనకై కార్మిక వర్గం నిర్వహించిన పోరాటాలకు వెన్ను దన్నుగా నిలిచి నలభై నాలుగు కార్మిక చట్టాల సాధనలో సిపిఐ తన వంతు పాత్ర పోషించిందని అన్నారు.రైతు సంఘాల ద్వారా దున్నేవారికి భూమి అనే నినాదంతో పాటు రైతు పండించిన పంటకు న్యాయమైన ధరల కోసం పోరాటాలు నిర్వహించింది. మహిళా సంఘాలను,విద్యార్థి సంఘాలను, యువజన సంఘాలను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం నింపి వారిని హక్కుల సాధనకై విశేషమైన కృషిని సల్పించి,స్వాతంత్ర ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రజా సమస్యలను పరిష్కారం కోసం దోహద పడింది. 1936 సంవత్సరం నుండి సిపిఐ ప్రధాన కార్యదర్శి పిసి జోషి గారి నాయకత్వంలో నిర్వహించిన పోరాటాలు అనేకమంది చిత్రహింసల పాలై జైలుకు వెళ్లారు. వేలాదిమంది త్యాగాలు చేశారు. అనంతరం స్వాతంత్రం వచ్చిన తర్వాత పార్లమెంట్లో ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషించి భూసంస్కరణ సాధించి అమల్లోకి తెచ్చింది.స్వాతంత్ర పోరాటం మరియు తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి పేద ప్రజలకు లక్షల ఎకరాల భూమిని పంచింది. గత మహాసభల నుండి ఇప్పుడు జరిగే మహాసభల వరకు పాలకవర్గాలతో ప్రజా సమస్యలపై పోరాటాలను రివ్యూ చేసుకొని ఈ మహాసభ భవిష్యత్ పోరాటాలను రూపొందించనుంది. కావున పెట్టి మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎస్ డి ఫయాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఫయాజ్ , గిరిజన సమాఖ్య తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ మనోజ్ కుమార్, కందుకూరు రవి,బోండ్ల వెంకన్న , శ్రీరాములు,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ దంపతులు



**చౌటుప్పల్, విశాలభారతి:**
పట్టణ కేంద్రంలోని ఊర ముత్యాలమ్మ ఆలయంలో బోనాల నైవేద్యాన్ని ఒడిబియ్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు సంధ్య దంపతులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ సంధగల్ల సతీష్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం,దండ అరుణ్ కుమార్, యాదవ్ సంఘ చైర్మన్ ఆవుల యేసు, చిలువేరు శ్రీశైలం, తొర్పునూరి రవి, సంధగల్ల కిరణ్, చింతకింది శ్రీనివాస్, తదితర సర్పంచులు బోనాల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**వాజేడు, విశాలభారతి:**
మండల పరిధి పేరూరు గ్రామపంచాయతీలో ముత్యాల అమ్మవారి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పేరూరు గ్రామంలో వెలిసినటువంటి ముత్యాల అమ్మకు బోనాల ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మహిళలు ఒక్కపొద్దు ఉండి అమ్మవారికి బోనం పోయటం ఆనవాతి గ్రామంలోనే ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటి నుండి బోనం తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కోడి పుంజులు, మేకపోతులు బలిచ్చి తమ మొక్కులను సమర్పించారు. మా గ్రామంలోని పాడిపంట అభివృద్ధి చెందాలని అమ్మవారు శరణు కోరుకొని తిరిగి ఇంటికి బయలుదేరారు.

## మైసమ్మ దేవాలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పసుమముల గ్రామం కళానగర్ వార్డ్ నెంబర్ 3 నందు ఎంతో అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి కోట మైసమ్మ దేవాలయ నందు విగ్రహ ప్రాణ ప్రతిష్ట నిర్వహించడం జరిగింది, గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఉదయం శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి కోట మైసమ్మ తల్లి దేవాలయాల నందు విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు, ప్రాణ ప్రతిష్టానంతరం ప్రజలు పోచమ్మ తల్లి కి బోనాలను సమర్పించి మహిళలు భారీ ఎత్తున బయలుదేరారు, పోతరాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలతో అమ్మవారికి గత మూడు రోజులుగా ప్రజలు ఎంతో అహ్లాదకరంగా నిర్వహించడం జరుగుతుందని స్థానిక మాజీ కౌన్సిలర్ మనెమ్మ రామలింగం తెలిపారు,

# 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆకలి చావులు

**బోడుప్పల్, విశాలభారతి:**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 339వ ఆదివారం జ్ఞానమాల ఘనంగా జరిగింది. అంబేద్కర్ ఆశయాలను,ఆకాంక్షలను నేటి యువతకు అందించాలనే దృఢ సంకల్పంతో,బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిర్విరామంగా 339 ఆదివారాలు ఒక యజ్ఞం లాగా జ్ఞానమాల కార్యక్రమం నిర్వహిస్తు నత్తి
మైసయ్య ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.నత్తి మైసయ్య స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించడం జరగడమే ఇందుకు నిదర్శనం.ఈ సందర్భంగా నత్తి మైసయ్య స్పందిస్తూ 79 ఏండ్ల స్వతంత్ర భారతంలో రైతుల ఆత్మహత్యలు,మహిళలు చిన్నారులపై మానభంగాలు,ఆకలి చావులు ఆగలేదని,ధనికులు మరింత ధనవంతులుగా పేదవారు నిరుపేదలుగా గుప్పెడు సంపన్న వర్గాల చేతిలో నలిగిపోతూనే ఉన్నారని,పాలకులు,ప్రభుత్వాలు పారదర్శకంగా జవాబుదారితనంగా పనిచేసినప్పుడే బడుగు బలహీన వర్గాలు అన్ని బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య,రాపోలు శ్రీరాములు గరుగుల యాకయ్య,సతీష్, ఆటో యూనియన్ నాయకులు మహంకాళి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతిక విలువలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయి

**చౌటుప్పల్, విశాలభారతి:**
తెలంగాణ సాంస్కృతిక విలువలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్ అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో బోనాల మహోత్సవం సందర్భంగా పబ్బు రాజు గౌడ్, శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. దేశ విదేశాలలో సైతం బోనాల జాతర జరుపుకుంటున్నారంటే అందుకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సాంప్రదాయాలే దానికి నిదర్శనం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బోనాల జాతర తెలంగాణలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో మునుగోడు నియోజకవర్గం లో ప్రజలను చల్లగా చూడాలని ఆయన వేడుకున్నారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండే విధంగా అమ్మవారు చూడాలని అన్నారు. ఆ అమ్మవారి ఆశీర్వాదంతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి - లక్ష్మి దంపతులు కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మల్కాజిగిరి బాబు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు దేప శ్యాంసుందర్ ముదిరాజ్,పబ్బు రాజు గౌడ్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## బోనాల ఉత్సవాలు ఐక్యతను భక్తి భావాలను పెంపొందిస్తాయి

**చౌటుప్పల్, విశాలభారతి:**
బోనాల ఉత్సవాలు ప్రజలలో ఐక్యతను భక్తి భావాలను పెంపొందిస్తాయని చౌటుప్పల్ మాజీ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ గౌడ్ అన్నారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బోనాల మహోత్సవం సందర్భంగా. తంగడపల్లి రోడ్డులో గల శ్రీ ఊర ముత్యాలమ్మ తల్లికి బత్తుల విప్లవ్ గౌడ్ – వాణి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ బోనాల ఉత్సవాన్ని ప్రతి సంవత్సరం దేవస్థాన కమిటీ అంగరంగ వైభవంగా కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ వేడుకలకు తాను హాజరవుతున్నట్లు తెలిపారు,హౌ హౌ ముత్యాలమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతోహౌ హౌ జీవించాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై కురవాలని,హౌ హౌ తనవంతుగాహౌదేవస్థానం అభివృద్ధికిహౌహౌఅన్ని విధాలాహౌ సహకరిస్తానని హామీ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చి బోనాల ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహిస్తున్న దేవస్థానం అధ్యక్షులు సంద గళ్ళ సతీష్ గౌడ్, మరియు దేవస్థాన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు తోర్పునూరి రవి గౌడ్,అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారితో పాటు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ బత్తుల విప్లవ్ గౌడ్ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## ఘనంగా సర్దార్ పాపన్న 375 వ జయంతి

**ఆర్మూర్, విశాలభారతి:**
గౌడ సంఘం , జిల్లా గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ముందస్తుగా సర్దార్ పాపన్న 375 వ జయంతిని ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ గల తిరుమల గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దేగాం యాదగౌడ్, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్,గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ లు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారితో పాటు ఆర్మూర్ డివిజన్ గౌడ సంఘం అధ్యక్షుడు కోటగిరి రామా గౌడ్, ఎనుగంటి అజయ్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోత్కూరి లింబాగౌడ్, ఎక్సైజ్ కాంట్రాక్టర్ లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న వారసులుగా ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జయంతిని జరపాలని చెప్పారు. గౌడ సంఘాలు గ్రామాల వారీగా తమ వృత్తిని రక్షించుకునేందుకు ప్రతి గ్రామంలో ఐదు ఎకరాలు ఈత తాటి వనాలు పెంచేందుకు,ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు.గౌడ కులస్తులు వృత్తితో పాటు విద్య,వైద్యం,రాజకీయంలో ఎమ్మెల్యేలుగా ఎదిగేంత స్థాయికి వెళ్లాలన్నారు. గౌడ కులస్తులు ఈత తాటి వనంపై నుండి క్రింద పడితే పది లక్షల ఎక్స్ గ్రేషియా అందేలా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో గౌడ సీనియర్ నాయకులు పెర్కిట్ దశ గౌడ్, శ్రీ చక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ హర్షవర్ధన్ గౌడ్, సుఖీభవ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ లింగా గౌడ్, మోతె రామ గౌడ్, రిటైర్డ్ ఎస్సై రాజేశ్వర్ గౌడ్, గౌడ సీనియర్ నాయకులు అంజాగౌడ్, మాజీ సర్పంచులు సాయినాథ్ గౌడ్, అనిల్ గౌడ్, ఎక్సైజ్ కాంట్రాక్టర్,ఉల్లి శ్రీనివాస్ గౌడ్, గోప అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు స్వరూప ఇంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.